# తోలు బొమ్మలు

(గల్పిక)

దిబ్బ రాజ్యం అధోగతిలో ఉండగా అక్కడికి తోలుబొమ్మలాట మొదటి సారిగా వచ్చింది. అది దిబ్బ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించవలసిన రోజు. అంతకుపూర్వం దిబ్బలో అన్ని కళలూ ఉన్నాయి, కాని పరిశ్రమలు లేక కళలు గుంటపూలు పూసాయి. తిండిలేక జనం ఎడా పెడా చచ్చారు. దేశంలో అరాజకం ఏర్పడింది.

తోలుబొమ్మలు జనాన్ని ఆకర్షించాయి. వాళ్ళు ఆకలి దప్పులు మరిచారు. తోలుబొమ్మలు ఒక మహత్తర సాంస్కృతికోద్యమమూ, అంతకన్న మహత్తర పరిశ్రమా అయి కూర్చున్నది.

కవులు కొత్త తోలుబొమ్మలాటలు రాసారు. గాయకులు తోలుపాటలు పాడారు. కళాకారులు రంగాలంకరణ చేశారు. నేపథ్య తోలునటులకు ఇంతా అంతా అని చెప్పటానికి వీల్లేని ఖ్యాతి వచ్చింది. తోలుపరిశ్రమలో లక్ష్మి తాండవించింది. బావులూ, చెరువులూ తవ్వించటానికి ఎర్రఏగానీ చందా ఇయ్యనివాళ్ళు, తోలుపరిశ్రమలో లక్షలు పెట్టుబడి చేసారు. తోలుకళాకారులు మంత్రులను మించి సంపాదించారు

తోలు సంస్కృతిని అధికారరీత్యా గుర్తించక తప్పలేదు. తోలునటులకూ, కవులకూ, కళాకారులకూ, గాయకులకూ "రాజపూజిత", "రాజోపచార", "తోలు కళాసార్వభౌమ" వగైరా బిరుదనామాలూ అవీ ఏర్పాటయాయి.

తోలుపరిశ్రమకు సంబంధించిన స్త్రీలూ, పురుషులూ దిబ్బసంస్కృతికి మహా లావాటి పట్టుకొమ్మలై, సాంస్కృతిక సప్తాహాలూ, దశాహాలూ జరిగి నప్పుడు పెత్తనంచేశారు.

దిబ్బలో అరాజకంపోయి ప్రజాస్వామ్యం అవతరించింది.

కొడవటిగంటి కుటుంబరావు